

2 లో

## మెదక్ జిల్లా వైద్యశాలను సందర్శించిన ఆరోగ్య శాఖ మంత్రి




మంగళవారం 25 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:07

-అభివృద్ధి కార్యక్రమాలు నిరంతర ప్రక్రియ..-మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత..

-ప్రజల అవసరాలకు అనుగుణంగానే అభివృద్ధి ప్రణాళికలు..-అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం అభినందనీయం-ఒక కోటి 69 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



2 లో

# గుమ్మడిదల అభివృద్ధికి సంపూర్ణ సహకారం..

# మెదక్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ సమావేశం



**మెదక్ (ప్రజాజ్యోతి)**

మెదక్ లో జరిగిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. గ్రామాలలో కార్యకర్తలు బలంగా ఉన్నప్పుడే పార్టీ బలపడుతుందని మరోసారి అధికారంలోకి వస్తామని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాలంటే కార్యకర్త చొరవ ఉండాలని ప్రతి కార్యకర్త ఒక సైనికుని గా పని చేయాలని అప్పుడే పార్టీ బలపడి మరోసారి అధికారంలోకి వస్తుందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.ఇంకా మనకు రెండు సంవత్సరాల సమయం ఉంది ఈ రెండు సంవత్సరాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ప్రతి కార్యకర్త ఈ పనిలో నిమగ్నం కావాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఇట్టి కార్యక్రమంలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మెదక్ శాసనసభ సభ్యుడు మైనంపల్లి రోహిత్ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ నిర్మల జగ్గారెడ్డి సంజీవరెడ్డి ఆకాంక్ష రెడ్డి పూజల హరికృష్ణ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆవుల రాజిరెడ్డి మెదక్ సిద్దిపేట్ సంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# మెదక్ జిల్లా వైద్యశాలను సందర్శించిన ఆరోగ్య శాఖ మంత్రి



మొదటిపేజీ తరువాయి

**మెదక్ (ప్రజా జ్యోతి)**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మెదక్ జిల్లా కేంద్రంలోని నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాకును స్థానికై శాసనసభ సభ్యుడు మైనంపల్లి రోహిత్ తో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు ఈ సందర్భంగా క్రిటికల్ కేర్ బ్లాకును త్వరలోనే ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లపై జి జి హెచ్ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సునీత దేవి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ నితిన్ కాబ్రా డిఎంహెచ్వో డాక్టర్ జ్ఞానేశ్వర్ డిసిహెచ్ఎస్ శివ దయాల్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాజీ శాసనసభ సభ్యులు మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు. క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన హెచ్ఆర్ ఎక్విప్మెంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఐ హెచ్ ఎఫ్ ఎం ఎస్ సేవలను అందుబాటులోకి తేవడంపై హైదరాబాద్ సచివాలయం ఉన్నత స్థాయి సమావేశం కు రావాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు అలాగే జిజిహెచ్ ఆస్పత్రిలో వైద్యసేవలా బలోపేతంపై మంత్రి చర్చించారు జిజిహెచ్ నూతన భవన నిర్మాణం పై మెడికల్ కాలేజీ విద్యార్థుల హాస్టల్ నిర్మాణంపై చర్చించారు. తూప్రాన్ లో ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామన్నారు జిల్లాల్లో నర్సాపూర్ రామయంపేట్ కౌడిపల్లి తూప్రాలలో కిడ్నీ రోగులకు అందిస్తున్న దయాలసిస్ సేవలను గురించి మెదక్ జిల్లా వైద్య ఆరోగ్య సేవ బలోపేతం అవసరమైన ప్రతి పాదన రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

---



# గుమ్మడిదల అభివృద్ధికి సంపూర్ణ సహకారం..

మొదటిపేజీ తరువాయి

**గుమ్మడిదల(ప్రజాజ్యోతి)**



నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యక్రమాలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లిలో న్యూల్యాండ్ పరిశ్రమ సహకారంతో 86 లక్షల 50 వేల రూపాయలతో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు, వీరన్న గూడెంలో 15 లక్షల సిఆర్ఆర్ నిధులతో అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు, గుమ్మడిదల లో హానర్ ల్యాబ్స్, మైత్రి పరిశ్రమల సౌజన్యంతో 45 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, యూజీడీల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.. అనంతరం నాగిరెడ్డిగూడెం గ్రామంలో న్యూ ల్యాండ్ పరిశ్రమ సహకారంతో 22 లక్షల రూపాయలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా అభివృద్ధి పనులను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతులు బలోపేతం చేయడం ద్వారా ప్రతి కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.గుమ్మడిదల ప్రాంత అభివృద్ధిలో పరిశ్రమల యాజమాన్యాలు, పారిశ్రామిక సంస్థలు సామాజిక బాధ్యతతో భాగస్వామ్యం కావడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు పరిశ్రమల సహకారం కూడా అందితే అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తిచేసే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గుమ్మడిదల మున్సిపాలిటీని సమగ్రంగా అభివృద్ధి చేసి, ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఆయా వార్డుల కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలి

# మెదక్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాలు

మెదక్ (ప్రజాజ్యోతి )



పెండింగ్ కేసులో దర్యాప్తును వేగవంతం చేసి బాధితులను సత్వరం న్యాయమందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు పోలీస్ అధికారులను ఆదేశించారు సోమవారం మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా స్టేషన్ లోని వివిధ విభాగాలను పరిశీలించి కేసులు దర్యాప్తు పెండింగ్ కేసులు స్టేషన్ రికార్డులు నిర్వహణ సిబ్బంది పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్లో లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించి పెండింగ్ కేసులను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు ప్రతి కేసులో ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి నిందితుల శిక్ష పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు కేసు దర్యాప్తు ఆలస్యం వహించకూడదని బాధ్యతగా నిర్వహించాలని సూచించారు ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించే చట్టపరంగా నిష్పాక్షికంగా విచారణ చేపట్టాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషనుకు వచ్చే ప్రజల్లో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సానుభూతితో విని పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన పోలీస్ సేవలు అందించాలి అని స్పష్టం చేశారు మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు రాత్రి వేళలో పెట్రోలింగ్ ముమ్మరం చేసి అనుమానాస్పద వ్యక్తులను వాహనాల కదలికలపైనే నిరంతరఓ నిగా ఉంచాలని సూచించారు గంజాయి ఇతర మాదకద్రవ్యాలు పేకాట అక్రమ కార్యపలాపాలం కటినంగా వ్యవహరించాలని ఆదేశించారు శాంతి భద్రత పరిరక్షణలో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పి సూచించారు క్రమశిక్షణ సమయపాలనతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించాలని సూచించారు ప్రజలతో సత్సంబాలు కొనసాగిస్తూ పోలీసులపై నమ్మకాన్ని మరింతగా పెంచేలా పనిచేయాలని ఎస్పీ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఎస్పీతోపాటు డిఎస్పి ప్రసన్నకుమార్ సిఐలు మహేష్ రాజశేఖర్ రెడ్డి సందీప్ రెడ్డి ఎస్సై సుమన్ ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.



---

# మెదక్ జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

మెదక్ (ప్రజాజ్యోతి)



మెదక్ జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగాయి. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ నెల 20న ఎన్నికల అధికారి, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.ఎన్నికల నోడల్ అధికారి అదనపు ఎస్పీ, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, రామకృష్ణ పర్యవేక్షణలో ఎన్నికలు సజావుగా కొనసాగాయి. ఎన్నికల ఏర్పాట్లను ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు స్వయంగా పరిశీలించి, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లా పరిధిలోని వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా అభిలాష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఆర్ఎస్ఐ నరేష్, కోశాధికారిగా విజయ్, సంయుక్త కార్యదర్శిగా రాము ఎన్నికయ్యారు.సంఘంలో ఎక్స్‌అఫిషియో సభ్యులుగా సాజిద్ అలీ, సతీష్, విజయ్ కుమార్, గంగామణి, నర్సింలు, రేణుక ఎన్నికయ్యారు. కోఆప్షన్ సభ్యులుగా గోపాల్, భాగ్యలక్ష్మి ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్‌తో పాటు పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.



---

# విద్యార్థి మృతి ఘటనపై హాస్టల్ ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి

## - బీఎస్పీ నారాయణఖేడ్ అధ్యక్షులు అనుముల తుకారం

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 24:

జూకల్ శివారులోని మహాత్మా జ్యోతిరావు పూలే హాస్టల్‌లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి మృతి చెందడం తీవ్ర విషాదకరమని బీఎస్పీ నారాయణఖేడ్ అధ్యక్షులు అనుముల తుకారం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హాస్టల్ ముందు నిరసన తెలుపుతూ, విద్యార్థి మృతి ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టి, బాధ్యులైన హాస్టల్ ప్రిన్సిపాల్‌తో పాటు సంబంధిత సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించి, న్యాయం చేయాలని కోరారు. అధికారులు ప్రభుత్వ హాస్టళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, విద్యార్థుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల నాయకులను హాస్టళ్లలోకి అనుమతించకపోవడం వల్ల అక్కడి పరిస్థితులపై పర్యవేక్షణ లోపించి నిర్లక్ష్యం పెరుగుతోందని ఆరోపించారు. విద్యార్థుల భద్రత, సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.తమ డిమాండ్లను ప్రభుత్వం, అధికారులు వెంటనే నెరవేర్చకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ నారాయణఖేడ్ ఉపాధ్యక్షులు కాశయ్య, సెక్రటరీ సాయిలు, నిజాంపేట్ మండల అధ్యక్షులు యోహాన్ తదితర నాయకులు పాల్గొన్నారు.





# శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి

## - శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి ఎస్బి టెట్ బలోపేతం చేయాలి

## - కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

## - ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సమ్రీన్




**మెదక్ (ప్రజాజ్యోతి)**

కాంగ్రెస్ ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వము విరమించుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులు పాలిటెక్నిక్ హాస్టల్ నుండి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్స్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటి బాధ్యతను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాలను అవలంబించడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య మరింత దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది జీవో ఎంఎస్ నెంబర్ 97/2026 లో పాలిటెక్నిక్ విద్యకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియన్ స్కిల్ యూనివర్సిటీ జాతీయ విద్యా విధానంలో భాగంగా ఏర్పాటు చేశారు ఆనంద్ మహేంద్ర ను చైర్మన్ గా ఉన్న పిపిపి లో భాగంగా నడుస్తున్న యూనివర్సిటీలో విలీనం చేస్తే ప్రభుత్వ విద్యార్థులు తీవ్ర నష్టం పోయే అవకాశం ఉంటుంది సాంకేతిక విద్య ప్రైవేట్ పరం అయ్యే అవకాశం ఉంది ప్రభుత్వం కూడా వీటిని యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసి ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయడం లేదని తక్షణమే ప్రభుత్వం తమకు విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రకటన చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుంది రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యకు స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఎస్ బి టేట్ కీలకమైన సంస్థ అని దాని పాత్రను కొనసాగిస్తూ మరింత బలోపేతం చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది ప్రభుత్వ శక్తి పాలసీ తీసుకొని వస్తే విద్యార్థులు ఉన్నత విద్యకు వెళ్లడానికి అవకాశం లేక వారి అకాడమిక్ ఎవరు నిర్ణయించాలో అర్థం కాని పరిస్థితి ఉంటుందని ఎస్పిటిఈటిని కొనసాగించి దాని పరిధిలోకి పాలిటెక్నిక్ విద్యార్థులను కొనసాగించాలి ఎస్ఎఫ్ఐ కోరుతుంది ప్రస్తుతం పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక వసతులు లాబరేటరీస్ వర్క్ భవనాలు బోధన సిబ్బంది తదితర అవసరాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో కల్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుంది విద్యార్థులకే కాకుండా అదే విధంగా అది అధ్యాపకులకు కూడా ప్రమాదంగా మారిది అని తెలిపారు. పాలిటెక్నిక్ అధ్యాపకులు సిబ్బంది ప్రత్యేక సర్వీస్ రూల్స్ రూపొందించి అమలు చేయాలని విద్యార్థుల ఫీజులను పెంచకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ కోరింది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఈడబ్ల్యూఎస్ విద్యార్థులను సంబంధించిన స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్లను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నాణ్యమైన అధ్యాపక ల్యాబ్ లో వర్క్ షాప్ లో హాస్టల్లో పరికరాల అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల అవసరాలను అనుగుణంగా ఆధునిక కరికులం తో పాటు ఉన్నత విద్యను వెళ్లేందుకు సరైన అకాడమిక్ స్టాండింగ్స్ మరియు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించే ఎస్ఎఫ్ఐ సూచించింది తక్షణమే రేవంత్ రెడ్డి ఈ జీవో ఎంఎస్ నెంబర్ 97 వెనక్కి తీసుకొని రద్దు చేయాలని డిమాండ్ చేశారు అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ సభ్యులు గణేష్ మెదక్ పాలిటెక్ విద్యార్థులు అక్షయ సంధ్యా అరుణ్ సాహిత్య అలాగే గోమారం పాలిటెక్నిక్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలి

## -2018 పీఆర్సీ తర్వాత నియామకమైన విద్యుత్ ఉద్యోగులపై 2022 పీఆర్సీలో జరిగిన అన్యాయంపై చర్చ

## -మింట్ కాంపౌండ్ బీసీ భవన్‌లో తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ ౧-82 సమావేశం





**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

ఆగస్టు 24: తెలంగాణ విద్యుత్ రంగంలో 2018 పీఆర్సీ అనంతరం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు 2022 పీఆర్సీలో జరిగిన అన్యాయంపై తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్-82 ఆధ్వర్యంలో మింట్ కాంపౌండ్‌లోని బీసీ భవన్‌లో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. రానున్న 2026 పీఆర్సీలో ఉద్యోగులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ముందస్తుగా ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని సమావేశంలో తీర్మానించారు. తెలంగాణ వ్యాప్తంగా జూనియర్ లైన్‌మెన్, జూనియర్ అసిస్టెంట్, సబ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ తదితర పోస్టుల్లో 2018 పీఆర్సీ తర్వాత డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైన ఉద్యోగులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గత 2022 పీఆర్సీ సందర్భంగా ఎదురైన సమస్యలు, ఉద్యోగులకు జరిగిన నష్టాలు, వాటి పరిష్కార మార్గాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రానున్న 2026 పీఆర్సీ ఉద్యోగుల హక్కులకు రక్షణ కల్పించే విధంగా ఉండాలని పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులందరూ భేదాభిప్రాయాలను పక్కనపెట్టి ఒకే తాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమిష్టిగా పోరాడేందుకు ఉద్యోగులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్-82 రాష్ట్ర అధ్యక్షుడు శోకత్ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిలు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జలీల్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డప్పు వెంకటేశం, రాష్ట్ర నాయకుడు వెంకట్ రెడ్డి, కంపెనీ నాయకులు ప్రభాకర్ చారి, బాల్ రెడ్డి, కావలి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# మధుమేహ కంటి వ్యాధుల గుర్తింపుపై ఏఐ పరిశోధనకు పీహెచ్‌డీ

## -గీతం పరిశోధక విద్యార్థిని జి. కార్తీకకు డాక్టరేట్



**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

మధుమేహ సంబంధిత కంటి వ్యాధులను కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా స్వయంచాలకంగా గుర్తించి, వాటి తీవ్రతను వర్గీకరించే అంశంపై పరిశోధన చేసిన గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ పరిశోధక విద్యార్థిని జి. కార్తీక పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించారు. గీతం హైదరాబాద్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఆమె 'డయాబెటిక్ రెటినోపతి, మధుమేహ సంబంధిత కంటి వ్యాధుల స్వయంచాలక గుర్తింపు, వర్గీకరణ కోసం డీప్ లెర్నింగ్, ట్రాన్స్‌ఫార్మర్ ఆధారిత ఫ్రేమ్‌వర్కులు' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. విజయకుమార్ మార్గదర్శకత్వం వహించారు. ఫండస్ చిత్రాల ఆధారంగా రెటీనా వ్యాధులను కచ్చితంగా గుర్తించేందుకు డీప్ లెర్నింగ్, విజన్ ట్రాన్స్‌ఫార్మర్స్, జెనరేటివ్ అడ్వర్సేరియల్ నెట్‌వర్క్స్ (+గాచీం) వంటి ఆధునిక ఏఐ నమూనాలను ఈ పరిశోధనలో అభివృద్ధి చేశారు. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో నేత్ర వైద్యులకు ముందస్తు నిర్ధారణలో ఇది తోడ్పడటంతో పాటు, పెద్ద ఎత్తున మధుమేహ నేత్ర పరీక్షలను సులభతరం చేసే అవకాశముందని తెలిపారు. కార్తీకకు పీహెచ్‌డీ అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, విభాగాధిపతి డాక్టర్ ఎస్. మహబూబ్ బాషా తదితరులు అభినందించారు.

## బీడు రాతి నేలను సాగుభూమిగా మార్చే యంత్రం ఆవిష్కరణ

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 24:**

బీడుగా ఉన్న రాతి నేలను సాగుభూమిగా మార్చేందుకు ఉపయోగపడే యంత్రాన్ని ఆవిష్కరించిన మండల పరిధిలోని బోరంచ గ్రామానికి చెందిన దీపక్ రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ ప్రతిభ శేఖర్ అభినందించారు. సోమవారం మనూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో దీపక్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ ప్రతిభ శేఖర్ మాట్లాడుతూ.. వ్యవసాయ పొలాల్లో రాళ్లు ఉండటం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, వాటిని తొలగించేందుకు యంత్రాన్ని తయారు చేయడం అభినందనీయమన్నారు. రైతులు పడుతున్న కష్టాలను గుర్తించి, వారికి ఉపయోగపడే విధంగా యంత్రాన్ని రూపొందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇలాంటి వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణు సాగర్, డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్ కుమార్, ఆర్ఐ శంకర్ రెడ్డి, ఖాజామోనుద్దీన్, బోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఖేడ్ మున్సిపల్ చైర్మన్

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి, ఆగస్టు 24:**

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డుకు చెందిన ఎలి గొడ్ల అంభవ్వ నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి సోమవారం మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ ముఖ్య అతిథిగా హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ నగేష్ షెట్కార్ మాట్లాడుతూ.. పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, లక్ష్మణ్, మైతాబ్ గోపాల్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు శెట్టి శంకర్, బసవ చేతన్, రహీం, గౌస్ చిస్తి, బాలయ్య, బక్షీరం, ఫైయాజ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.





## సంగారెడ్డిలో విషాదం: కన్నవారిని పొట్టనబెట్టుకున్న కేసులో జైలుకు వెళ్లిన యువతి ఆత్మహత్య

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**





సంగారెడ్డిలో సంచలన ఘటన చోటుచేసుకుంది. గత జనవరిలో తల్లిదండ్రులను హత్య చేసి జైలుకు వెళ్లిన యువతి.. తాజాగా ఆత్మహత్య చేసుకుంది. జైలు నుంచి బెయిల్ పై బయటకు వచ్చిన కొద్ది రోజులకే బలవన్మరణానికి పాల్పడటం కలకలం రేపుతోంది.సంగారెడ్డిలో నర్సుగా పని చేసిన సురేఖ (25) ప్రియుడితో పెళ్లికి తల్లిదండ్రులు నిరాకరించారనే కోపంతో... ఈ ఏడాది జనవరిలో తండ్రి దశరథ్, తల్లి లక్ష్మి లను మత్తు ఇంజక్షన్ ఇచ్చి దారుణంగా హత్య చేసింది. ఈ ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. నిందితురాలు సురేఖను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.అయితే ఇటీవలే బెయిల్ పై బయటకు వచ్చిన సురేఖ.. సంగారెడ్డిలోని శాంతినగర్ లో ఓ ప్రైవేట్ ఉమెన్స్ హాస్టల్ లో ఉంటోంది. ఈ క్రమంలో నిన్న రాత్రి తల్లిదండ్రులను చంపిన తరహాలోనే తాను కూడా ఇంజక్షన్ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. గమనించిన హాస్టల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు.ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## దైవ కార్యానికి ఎమ్మెల్యే భారీ విరాళం

- జిన్నారం పోచమ్మ దేవాలయ నిర్మాణానికి రూ.12 లక్షల అందజేత

-నియోజకవర్గంలో గుడులు, మసీదులు, చర్చిల నిర్మాణానికి సహకారం



**జిన్నారం(ప్రజాజ్యోతి)**

ప్రజాసేవతో పాటు ఆధ్యాత్మిక సేవకు కూడా ప్రాధాన్యత ఇస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి (జీఎంఆర్) జిన్నారం మున్సిపల్ కేంద్రంలో నిర్మిస్తున్న పోచమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి రూ.12 లక్షల భారీ విరాళం అందించారు. మాల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఆలయ నిర్మాణ పనులను సోమవారం ఆయన స్వయంగా పరిశీలించి, ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ దైవభక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజాసేవను తన బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా ప్రజలను ఐక్యం చేసే సామాజిక వేదికలని పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవిస్తూ సొంత నిధులతో దేవాలయాలు, మసీదులు, ఆశూర్‌ఖానాలు, చర్చిల నిర్మాణానికి సహకరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 200కు పైగా దేవాలయాలు, మసీదులు, ఆశూర్‌ఖానాలు, చర్చిల నిర్మాణానికి సహకారం అందించినట్లు గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈనెల 30న నిర్వహించనున్న పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యత స్ఫూర్తిదాయకమని





స్థానికులు ప్రశంసించారు. ఈకార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, బాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# నల్లవాగు ప్రాజెక్టుకు భారీగా వరద..

## – బీబీపేట్ చెరువు పొంగి పొరాతున్న అలుగు .

## – నీటిపారుదల శాఖ అధికారి మల్లేశం

**కల్హేర్, ఆగస్టు 24: ప్రజా జ్యోతి.**

సంగారెడ్డి జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టుకు 1,506 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు ఏఈఈ మల్లేశం ఆదివారం తెలిపారు. ఎగువ ప్రాంతమైన కర్ణాటక నుంచి వరద నీరు వచ్చి చేరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 746 ఎంసీఎఫ్టీ కాగా, ప్రస్తుతం 746 ఎంసీఎఫ్టీ నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. అలుగు ద్వారా 1,360 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తుండగా, కుడి, ఎడమ కాలువల ద్వారా మరో 146 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈఈ వివరించారు.ఇదిలా ఉండగా, కల్హేర్ మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో బీబీపేట్ చెరువు నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో చెరువు అలుగు పారుతోంది. మత్తడి దూకుతుండటంతో చెరువు జలకళను సంతరించుకుంది.చెరువు పూర్తిస్థాయిలో నిండటంతో ఆయకట్టు రైతులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పంటలకు సాగునీటి ఇబ్బందులు ఉండవని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





# పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు మెట్రో పొడిగించాలి

## – హెచ్ఎండీఏ కమిషనర్, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసిన ఎంపీ రఘునందన్‌రావు

## -పెండింగ్ సర్వీస్ రోడ్ల పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి





**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రవాణా, మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలు మార్గాన్ని పొడిగించే అంశంతో పాటు పలు కీలక సర్వీస్ రోడ్ల నిర్మాణాలపై హెచ్ఎండీఏ కమిషనర్, మెట్రో రైల్వే మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసి సోమవారం చర్చించారు. పటాన్‌చెరు, సంగారెడ్డి ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా, పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు సేవలను సంగారెడ్డి వరకు విస్తరించాలని ఎంపీ కోరారు. పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు మెట్రో పొడిగింపు జరిగితే హైదరాబాద్ నగరంతో పశ్చిమ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి కూడా తగ్గుతుందని వివరించినట్లు తెలిపారు.

### పెండింగ్ సర్వీస్ రోడ్లపై ప్రత్యేక దృష్టి

అనంతరం ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పటాన్‌చెరు ఎగ్జిట్-3 నుంచి ఎగ్జిట్-4 వరకు, అలాగే సుల్తాన్‌పూర్ మధ్య ఇంకా పూర్తి కాకుండా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని కోరారు.ఈ ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు అందుబాటులో లేక స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్ పనులు పూర్తయితే పారిశ్రామిక ప్రాంతాలకు రాకపోకలు సులభతరం అవుతాయని, స్థానిక గ్రామాల ప్రజలకు కూడా మెరుగైన ప్రయాణ సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు.

### కొల్లూరు ఎగ్జిట్-2 రోడ్డు పనులు పూర్తి చేయాలి

కొల్లూరు ఎగ్జిట్-2 వద్ద పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను కూడా అత్యవసరంగా పూర్తి చేయాలని ఎంపీ రఘునందన్‌రావు కోరారు. ఈ మార్గంలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రధాన మౌలిక వసతులపై నిరంతరం అధికారులతో చర్చిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు.

# కల్హేర్ ప్రజావాణికి నాలుగు ఫిర్యాదులు

## – ఎంపీడీఓ హరినందన్ రావు

**కల్హేర్, ఆగస్టు 24: ప్రజా జ్యోతి.**

కల్హేర్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ హరినందన్ రావు తెలిపారు. పంచాయతీరాజ్, ఐకేపీ, రెవెన్యూ, హౌసింగ్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించినట్లు ఎంపీడీఓ తెలిపారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యమిస్తూ సత్వర పరిష్కారం చూపాలని సూచించారు.ప్రజలు చైతన్యవంతులై తమకు ఎదురయ్యే సమస్యలను నేరుగా ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. పంట పొలాల్లో కాంపౌండ్ నిర్మాణం, రహదారులు, ఇళ్ల నిర్మాణం, వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్లు తదితర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే.తాగునీరు, ఆరోగ్య సంబంధిత సమస్యలు, మలేరియా, టైఫాయిడ్, వంటి వ్యాధులపై అవగాహన లేదా సమస్యలు ఉంటే సమీపంలోని ఆసుపత్రులను సంప్రదించి పరిష్కారం పొందాలని సూచించారు.ప్రజలకు ఏదైనా సమస్య ఎదురైతే ఆలస్యం చేయకుండా ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని ఎంపీడీఓ హరినందన్ రావు కోరారు..



# పాఠశాలలను సందర్శించిన విద్యాశాఖ అధికారి బి. సురేష్

## - విద్యార్థుల పఠన, రచనా నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన

**కల్హేర్.24.ఆగస్టు. ప్రజా జ్యోతి**

కల్హేర్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను విద్యాశాఖ అధికారి బొర్ర సురేష్ సందర్శించారు . ఈ సందర్భంగా ఎం.పి.పి. ఎస్. కల్హేర్ (ఎఫ్ఎల్ఎన్ కాంపోనెంట్ స్కూల్), ఎం.పి.పి.ఎస్. పొమ్యానాయక్ తండా, ఎం.పి.పి.ఎస్. కొత్తచెరువు తండా పాఠశాలలను ఆయన పరిశీలించారు.పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభ్యాసాన్ని పరిశీలించిన ఆయన, విద్యార్థుల వర్క్‌బుక్‌లను క్రమం తప్పకుండా సరిదిద్దాలని సంబంధిత ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా ప్రతి విద్యార్థిలో చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని ఆయన పేర్కొన్నారు.



# వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

## రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 24:-**






రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాలకు కేటాయించిన మొక్కల నాటే లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులు, డీఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వన మహోత్సవం2026 లక్ష్యసాధనపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భావితరాలకు సమతుల్యమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను అధికారులు సమన్వయంతో పనిచేసి వంద శాతం పూర్తి చేయాలని సూచించారు.అటవీ శాఖ నర్సరీల్లో తగినన్ని మొక్కలు అందుబాటులో ఉన్నందున, గుర్తించిన ప్రాంతాలకు అనుగుణంగా సరైన మొక్కలను ఎంపిక చేసి నాటాలని తెలిపారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నాటిన ప్రతి మొక్క బతికేలా చూడాలని సూచించారు. పశువులు, ఇతర జంతువుల నుంచి మొక్కలను రక్షించేందుకు అవసరమైన చోట్ల ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అర్బన్ ఫారెస్ట్ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేయాలని మంత్రి సూచించారు. దేవాలయాల ప్రాంగణాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన మొక్కలను నాటేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం లక్ష్యం పూర్తయినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో మొక్కల నాటే కార్యక్రమం ఆశించిన స్థాయిలో లేదని మంత్రి పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 25న (మంగళవారం) గ్రామపంచాయతీ స్థాయి నుంచి పట్టణ ప్రాంతాల వరకు సామూహిక మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని జిల్లాల్లో పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లను భాగస్వాములను చేయాలని తెలిపారు.సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, జిల్లాలో వన మహోత్సవం2026లో భాగంగా 34 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 21 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో అడిషనల్ కలెక్టర్ పాండు సమీక్ష నిర్వహించారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని రానున్న రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను సాధించేందుకు ఆయా శాఖలు సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థల పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటాలని, ముఖ్యంగా మున్సిపల్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో బండ్ ప్రాంతాల్లో ప్లాంటేషన్ చేపట్టాలని, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటాలని సూచించారు.ఆగస్టు 25న ప్రతి ప్రాంతంలో విస్తృతంగా మొక్కలు నాటి, కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను సంబంధిత అధికారులు షేర్ చేయాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు. జిల్లా వన మహోత్సవం లక్ష్యాన్ని వంద శాతం సాధించేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ జ్యోతి, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ఆవరణలో బురదమయం

## - మురికికాలువను తలపిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం

**కల్వ ర్ట్.24.ఆగస్టు. ప్రజా జ్యోతి**



కల్వేర్ మండలం: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం సమస్యలకు నిలయంగా మారింది. వర్షం కురిసిన ప్రతిసారీ పాఠశాల ఆవరణలో నీరు నిలిచి బురదమయంగా మారుతుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ప్రాంగణాన్ని చూస్తే మురికికాలువను తలపించే పరిస్థితి నెలకొంది.పాఠశాల ఆవరణలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక అక్కడే నిలిచిపోతోంది. దీంతో బురదలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నిలిచిన నీటిలో దోమలు, ఇతర క్రిమికీటకాలు వృద్ధి చెందే అవకాశం ఉండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానం

పాఠశాలలోని మరుగుదొడ్ల పరిస్థితి కూడా విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. మరుగుదొడ్డికి వెళ్లేందుకు తలుపులు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. పాఠశాలలో కనీస మౌలిక వసతులు సరిగా లేకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రహరీ గోడ, గేటు సమస్యలు

పాఠశాలకు సంబంధించిన ప్రహరీ గోడ నిర్మాణం కూడా పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఆవరణ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాలకు సరైన గేటు సదుపాయం లేకపోవడం వల్ల విద్యార్థుల రక్షణ విషయంలో కూడా ఆందోళన నెలకొంది.

### అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు



పాఠశాలలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. ముందుగా పాఠశాల ఆవరణలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని, మరుగుదొడ్లకు కొత్త తలుపులు ఏర్పాటు చేయాలని, ప్రహరీ గోడ మరియు గేటు నిర్మాణాన్ని పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసే పాఠశాలలో కనీస వసతులు కూడా లేకపోవడం బాధాకరమని, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పాఠశాలను పరిశీలించి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.